# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్





టీవీలో ప్రత్యక్ష డిబేట్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కాళేశ్వరం కార్యక్రమాన్ని తిలకించిన మాజీ మంత్రి

ఎదులాపురం, జూన్ 7: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. అందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న లైవ్ టెలికాస్ట్ యాప్ ద్వారా టీవీలో ప్రత్యక్ష డిబేట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపులో భాగంగా మాజీ మంత్రి జోగు రామన్న టీవీలో డిబేట్ సమావేశాన్ని తిలకించారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా కార్యకర్తలలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విశ్లేషణను వివరించారు. ఈ సమావేశంతో కార్యకర్తల్లో కాంగ్రెస్ ప్రభుత్వ విషపూరిత ప్రచారాలను ఎదుర్కొనేలా అవగాహన కల్పించారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కండ్లకు కట్టినట్లు ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ బిల్లులు లేపుకునే కాంగ్రెస్ నేతల మాటలను తిప్పికొట్టాలన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ గ్రామాల్లో నీటి సౌకర్యం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. కమిషన్ల లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రతిష్టాత్మక పనులపై బురద చల్లడమే తప్ప ప్రజా సంక్షేమంపై దృష్టి సారించలేకపోవడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు ప్రహ్లాద్, చందాల రాజన్న, బట్టు సతీశ్, కొండ గణేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఎదులాపురం : ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం



నేరడిగొండ : ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## భక్తిశ్రద్ధలతో బక్రీద్

*ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ పండుగ విశిష్టతను తెలిపారు. వాంకిడి, నేరడిగొండ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఆలం బక్రీద్ సందర్భంగా సేమియాలను కార్యాలయానికి తీసుకొచ్చారు. మాజీ మంత్రి జోగు రామన్న సేమియాలను తాగుతూ ఆనంద వ్యక్తం చేశారు. ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు నేతలు, రాజకీయ, పట్టణ ప్రముఖులు ఈద్గాల వద్ద పండుగ శుభాకాంక్షలు తెలిపారు.*



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

## ఇంటినంబర్ ఇచ్చేయ్.. రిజిస్ట్రేషన్ చేసేయ్

### మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్ అధికారుల వ్యవహారశైలి

- అక్రమంగా ఇంటి నంబర్ల జారీ.. నకిలీ రిజిస్ట్రేషన్‌లపై ఫిర్యాదు.. • పలువురిపై కేసులు నమోదు

ఆదిలాబాద్, జూన్ 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలతోపాటు, కిరాయితో ఉంటున్న ఇండ్లకు మున్సిపాలిటీ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించడం, అక్రమార్కులు ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వెలుగులోకి వస్తున్నాయి. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలతో ఫిర్యాదులు రావడంతోపాటు యజమానులు తమ ఇంటికి ఇతరులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. స్థలాల అక్రమణలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ కబ్జాదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు ఉన్నాయని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాదారులు మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకుంటున్నారు. మరికొందరు తాము కిరాయి ఉంటున్న ఇండ్లకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మున్సిపాలిటీలో ఫేక్ డోర్ నంబర్ తీసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమ పేరిట యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం

### అధికారుల వ్యవహారశైలిపై ఆరోపణలు

మున్సిపాలిటీ అధికారులు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో షెడ్లు, ఇతరుల పేరిట ఉన్న స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా తమ సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకునే ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలు, లింక్ డాక్యుమెంట్‌లతో మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకుంటే అన్ని పరిశీలించిన అధికారులు డోర్ నంబర్‌లు కేటాయించాలి. కిరాయి ఉంటున్న వారు నకిలీ పత్రాలు సృష్టించి దరఖాస్తు చేసుకుంటే ఇంటి నంబరు ఇవ్వడం కుదరదు. మున్సిపాలిటీ అధికారులు ఖాళీ స్థలాల్లో షెడ్లకు ఇంటి నంబర్లు, కిరాయికి ఉంటున్న వారు నకిలీ పత్రాలతో దరఖాస్తు చేసుకున్నా డోర్ నంబర్లు కేటాయిస్తున్నారు. ఇంటి నంబర్లు ఆధారంగా అక్రమార్కులు విలువైన స్థలాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. గతంలో మున్సిపాలిటీ కేటాయించిన ఇంటి నంబర్ల రిజిస్ట్రేషన్ చేయాలంటే రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు మున్సిపల్ కమిషనర్ నుంచి అభ్యతరం లేదనే పత్రాలు తీసుకురమ్మనే వారు. ఇప్పుడు ఆ నిబంధన అమలు చేయడం లేదు. అక్రమణలపై పోలీసులకు ఇప్పటికే పలు ఫిర్యాదులు రాగా విచారణ జరిపి నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. అక్రమార్కులపై పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రజలు అభినందిస్తున్నారు.

## క్యాన్సర్ రోగులకు ఉపశమనం

### నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న జెరియాట్రిక్ వార్డు



నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 7 : రోగుల జీవన ప్రమణాన్ని మెరుగుపరచడంతోపాటు క్యాన్సర్ మహమ్మారితో పోరాడే సహజ సామర్థ్యాన్ని పెంచేందుకు వైద్య కళాశాల ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య సేవలందించేందుకు నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో 20 పడకల చొప్పున జెరియాట్రిక్ వార్డులు, క్యాన్సర్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలియేటివ్ కేర్ కేంద్రం ఏర్పాటయింది. ఇక్కడ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందిస్తున్నారు. నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జెరియాట్రిక్ వార్డులు, క్యాన్సర్ కేంద్రాలను త్వరలో ప్రారంభం కానున్నాయి. క్యాన్సర్ కేర్ కేంద్రం, పాలియేటివ్ కేర్ పక్షవాతంతోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగించేందుకు ఉపయోగించనున్నారు. ఇందుకు ఆసుపత్రిలో ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేశారు. జెరియాట్రిక్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతవాసులకు ప్రయోజనం చేకూరనుంది.

### అందుబాటులో సేవలు

వృద్ధాప్యంలో గుండె జబ్బులు, షుగర్, బీపీతోపాటు ఇతర వ్యాధులు ఉండడం వల్ల వీటిని ఎదుర్కోవడం కష్టతరమవుతుంది. అలాంటి వాటికి ప్రత్యేక వార్డుల్లో నైపుణ్యం కలిగిన వైద్యులు(జెరియాట్రిషన్లు) అందుబాటులో ఉండి అవసరమైన చికిత్సలు, మందులు అందిస్తారు. శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్య అంశాలను సమగ్రంగా పరిశీలించడం, వృద్ధులు ఎదుర్కొనే సమస్యలను ముందుగా గుర్తించడం, ప్రతిరోగి అవసరాలకు అనుగుణంగా చికిత్స విధానం రూపొందిస్తారు. ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు కౌన్సెలింగ్ ఇస్తారు. జెరియాట్రిక్ వార్డులలో సేవలన్నీ ఒకే చోట లభిస్తాయి. కీమోథెరపీ, రేడియేషన్, కౌన్సిలింగ్ వంటి సేవలు ఒకే చోట లభిస్తాయి. చికిత్సలు రోగులకు అందుబాటులో లభించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదు. సమయం, డబ్బు ఆదా అవుతుంది. క్యాన్సర్ కేంద్రాలలో రోగ నిర్ధారణ, చికిత్స త్వరగా అందే ఆస్కారం ఉంది.



వైద్య కళాశాల ఆసుపత్రిలోని పాలియేటివ్ కేంద్రం

## పోడు రైతుల ధర్నా

ఖానాపూర్ టౌన్, జూన్ 7 : తర్లపాడ్ గ్రామానికి చెందిన పలువురు పోడు భూముల రైతులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖానాపూర్ ఫారెస్టు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ అధికారులు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో కంచె ఏర్పాటు చేసి సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము సాగు చేసుకుంటున్న భూములను సర్వే నిర్వహించి తమకు రసీదులు ఇచ్చారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్, తిరుపతి, నాగెల్లి నర్సయ్య, బాధిత రైతులు బోసు నర్సయ్య, భూమన్న పాల్గొన్నారు.




కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తున్న బాధిత రైతులు

## గుంతలు పడి.. కంకర తేలి

- నరకప్రాయంగా పల్లె రహదారులు
- పట్టించుకోని పాలకులు.. మరమ్మతులు కరువు..



బురదమయమైన వాలేగాం-రంగరివాడ రహదారి



శిథిలమైన సిరాల రహదారి



అధ్వానంగా వాడి రహదారి




చిన్నపాటి వర్షానికే నీటి గుంతలతో నిండిన ఖత్‌గాం రోడ్డు



కంకర తేలిన మహాగాం-చింతల్‌బోరి దారి

భైంసా టౌన్, జూన్ 7 : భైంసా మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడి, కంకర తేలి, వంకలుగా ఉండి వాహనదారులు, పాదచారులు నడువ లేని దుస్థితి నెలకున్నది. మండలంలోని పెండ్‌పల్లి, ఇలేగాం, ఖత్‌గాం, సిరాల, మహగాం-చింతల్‌బోరి, సిద్దూర్, వాలేగాం-రంగరివాడ, వాడి గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం భైంసా మండలానికి వస్తుంటారు. విద్యార్థులు చదువుకోవడానికి, కూలీలు పనులకు, దవాఖానలకు వంటి ప్రజలు వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. మూడు కిలో మీటర్ల మేర పెండ్‌పల్లి రహదారి, రెండు కిలోమీటర్ల మేర ఇలేగాం, రెండు కిలోమీటర్ల మేర ఖత్‌గాం, రెండు కిలో మీటర్ల మేర సిరాల, రెండు కిలోమీటర్ల మేర మహగాం-చింతల్‌బోరి, కిలోమీటరు మేర సిద్దూర్, మూడు కిలో మీటర్ల మేర వాలేగాం-రంగరివాడ, రెండు కిలో మీటర్ల మేర వాడి గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీటిలో పెండ్‌పల్లి, ఖత్‌గాం గ్రామాలకు రూ.కోటి చొప్పున నిధులు కూడా కేటాయించారు. అయినా పనులు ప్రారంభం కాలేదు. తాజాగా పది రోజుల క్రితం ఖత్‌గాం గ్రామస్తులు రహదారులను బాగు చేయాలని ధర్నా కూడా చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సర్కారోళ్లు స్పందించి రోడ్లను బాగు చేయించాలని పల్లెవాసులు కోరుతున్నారు.



కంకర తేలిన పెండ్‌పల్లి రోడ్డు